క్లుప్తంగా

నేడు సీతారామస్వామికి అభిషేకం

మైలవరం: మైలవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీకోదండ రామాలయంలో మంగళ వారం ఉదయం తొమ్మిది గంటలకు పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు మణికొండ చిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి చామర్తి వెంకటకృష్ణమూర్తి, జులూరు రమేష్, అనుమోలు అప్పారావు, మిరియాల జగన్మోహనరావు తెలిపారు.

రెడ్డిగూడెం ఎంఈఓగా రమేష్

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల విద్యాశాఖాధికారిగా పజ్జూరి రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విస్సన్నపేట హైస్కూలు హెచ్‌ఎంగా పనిచేస్తున్న పజ్జూరి రమేష్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా అధికారులు రెడ్డిగూడెం విద్యాశాఖాధికారిగా నియమించారు. ఇక్కడ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న పి.రఘురామ్‌ను వణుకూరు జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు.

విస్సన్నపేట ఎంఈఓ–2గా సుధాకర్

విస్సన్నపేట: విస్సన్నపేట మండల ఎంఈఓ–2 గా సుధాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంఈఓగా పని చేసిన రామకృష్ణ తిరువూరు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సుధాకర్ బాధ్యలు చేపట్టారు.

మైలవరం ఎంఈఓ–2గా బాలు

మైలవరం: మైలవరం మండలం ఎంఈఓ–2గా బాలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాలుకు పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పీ. గోపాల్, వెంకటేష్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

నూజివీడు ఎంఈఓ–2గా జమలయ్య

నూజివీడు: మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ)–2గా సంగెపు జమలయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న జమలయ్యను ప్రభుత్వం ఎంఈఓ–2గా నియమించింది. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన వెంకటేశ్వర్లు విజయవాడకు బదిలీ అయ్యారు. నూతన ఎంఈఓను మండలంలోని యూటీఎఫ్, ఎస్‌టీయూ, డీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

6,700 మందికి ఉపాధి పనులు

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, పోలిశెట్టిపాడు పలు గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని ఏపీఓ జే రామారావు సోమవారం తెలిపారు. 21 గ్రామాల్లో 6,754 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారని వీరికి అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సత్యసాయి సేవామందిరంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ నాగమల్లేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సంవత్సరానికి మూడు ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో నూజివీడు గిఫర్డు మెమోరియల్ కంటి ఆస్పత్రి డాక్టర్లు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 32 మందికి కంటి ఆపరేషన్లు అవసరంగా గుర్తించినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి తెలిపారు. ఆపరేషన్లు మంగళవారం ఉచితంగా చేయించనున్నట్లు పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు రాజారావు, చక్రధరరావు, మధుసూదనరావు, శ్రీలక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

పందుల నివారణకు చర్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతి నగర్‌లో సంచరిస్తున్న పందుల నివారణకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలోని ఓ వీధిలో పెంచుతున్న పందులపై అక్కడి ప్రజలు సామాజిక మాధ్యమాల్లో తెలియజేయడంతో స్పందించిన కమిషనర్ సిబ్బందిని పంపించి పందుల నివారణకు చర్యలు తీసుకున్నారు.

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ

నూజివీడు: ఉపాధిహామీ సిబ్బంది సామాజిక తనిఖీల్లో చేసిన తప్పులపై పలుమార్లు చర్యలు తీసుకున్నా మార్పు రాకపోవడంపై డ్వామా ఏలూరు పీడీ ఏ రాము తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల వారీగా చోటుచేసుకున్న అవకతవకలను వివరించారు. దీనిపై పీడీ మాట్లాడుతూ పలు గ్రామాల్లో హౌసింగ్ గృహాలకు సంబంధించి బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే నిర్మించుకుంటే రూఫ్ లెవెల్ వరకు బిల్లు ఎలా చెల్లించారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, ఏపీడీ శ్రీదేవి, ఎస్‌ఆర్‌పీ రామచంద్ర, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏపీఓ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

- మండలంలో లేఅవుట్ల సంఖ్య - 35
- పట్టాలు పొందిన వారి సంఖ్య - 1,730
- గృహ నిర్మాణాలకు ముందుకొచ్చిన వారి సంఖ్య - 1,039

చాట్రాయి: పేదలకు నివేశన స్థలం కేటాయించి, సొంత ఇల్లు నిర్మించి వారి కలను సాకారం చేయాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్లు అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. చాలీచాలని గదుల్లో ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న వారు, అద్దె ఇంట్లో ఉంటున్న వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గృహాలను నిర్మిస్తోంది. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 35 లే అవుట్లల్లో 1,730 మందికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసింది. వీటిలో 1,039 మంది గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఇవి కాకుండా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో సొంత స్థలాల్లో 982 మందికి గృహాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క



చనుబండ లే అవుట్లో చేపట్టిన గృహ నిర్మాణాలు

ఇంటికి రూ.1.80 లక్షలు వెచ్చించనున్నారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవెల్లో 80 గృహాలు నిర్మాణాలు చేపట్టగా ఇనుము, ఇసుక, సిమెంట్‌ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ నిధులు కాకుండా వెలుగు శాఖ ద్వారా పావలా వడ్డీకి రూ.35 వేలు ఇవ్వనున్నారు.

మా బాధలు తీరనున్నాయి



చిన్న పూరి పాకలో ఏళ్ల తరబడి ఐదుగురు కుటుంబ సభ్యులు నివసిస్తున్నాం. బంధువులు వస్తే కూర్చోవడానికి స్థలం ఉండేది కాదు. వర్షం కురిస్తే తడవాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సెంటున్నర స్థలం మంజూరు చేసి ఉచితంగా ఇల్లు నిర్మిస్తుండడంతో మా బాధలు తీరనున్నాయి.

– కల్లేపల్లి దేవి,
చనుబండ, చాట్రాయి మండలం

తొలగనున్న విద్యుత్ కష్టాలు

- ఎమ్మార్ అప్పారావు కాలనీలో రూ.43 లక్షలతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి విద్యుత్ కష్టాలు తొలగనున్నాయి. ఈ కాలనీ ఏర్పాటైన 16 ఏళ్ల నుంచి అన్నవరం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఇది రూరల్ బ్రేకర్‌పై ఉండటంతో రూరల్ ఏరియాకు విద్యుత్ కోత విధించినా, మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేసినా, గాలివానలు, విద్యుత్ తీగలు తెగిన సమయంలో పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి విద్యుత్ సరఫరా గంటలపాటు నిలిపివేసేవారు. దీంతో కాలనీలో నివాసముంటున్న ఐదు వేల మంది ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే కృషితో సమస్యకు పరిష్కారం

కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లి వివరించారు. కాలనీకి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక బ్రేకర్‌ను



ఎమ్మార్ అప్పారావు కాలనీకి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్

ఏర్పాటు చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అన్నవరం బ్రేకర్‌పై ఉన్న కాలనీ మొత్తానికి కలిపి ప్రత్యేక బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ బ్రేకర్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించనున్నారు.

కృష్ణాజలాల సరఫరాను ప్రారంభించనున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ఎమ్మార్ అప్పారావు కాలనీలోని లెదర్ ఫ్యాక్టరీ ఏరియాలోని సుమారు 150 గృహాల వారికి నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.20.50 లక్షలతో చేపట్టిన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను పూర్తిచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.13 లక్షలతో సాయిబాబా గుడి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. వీటన్నింటినీ ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించనున్నారు.

లారీలను ఆపుతున్న వ్యక్తులపై కేసు

నూజివీడు: గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీలను ఆపి డ్రైవర్, క్లీనర్లతో గొడవపడిన నలుగురు హనుమాన్ సేనకు చెందిన వ్యక్తులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. లారీ క్లీనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆర్.అంకబాబు తెలిపారు. నూజివీడు రూరల్ పరిధిలోని తుక్కులూరు, లీలానగర్ అడ్డరోడ్డు తదితర ప్రాంతాల్లో పలుమార్లు లారీలను ఆపి పోలీసులకు అప్పగించి దాదాపు 500 గోవులను రక్షించడంతో పాటు గోసంరక్షణ కేంద్రాలకు తరలించారు. లారీలను ఆపి తమతో గొడవపడుతున్నారని పేర్కొంటూ క్లీనర్ తాణంకి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, ఎస్సై తలారి రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు. అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు సమాచారం వస్తే పోలీసులకు తెలియజేస్తే పోలీసు సిబ్బంది వెళ్లి అడ్డుకుంటామని పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలోని సీతారామపురం శివారుల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై నంబూరి చంటిబాబు సోమవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమార్కులే అక్రమాలపై మాట్లాడటం హాస్యాస్పదం

జి.కొండూరు: గత ప్రభుత్వంలో అనేక అక్రమాలకు పాల్పడిన ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు అక్రమాల గురించి మాట్లాడడం చూస్తే దొంగే దొంగా దొంగా అన్నట్లు ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు, చిన్ననందిగామ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పి.శివనాగేశ్వరరావు అన్నారు. చిన్ననందిగామలో రైతులతో కలిసి శివనాగేశ్వరరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని పెద్ద చెరువులో మట్టి తవ్వకాలపై గ్రామ సర్పంచ్ ధనేకుల శ్రీకాంత్, ఆయన తండ్రి సాంబశివరావుచేసిన ఆరోపణలను శివనాగేశ్వరరావు ఖండించారు. గ్రామంలోని వనరుల నుంచి వచ్చిన ఆదాయంతో గ్రామాభివృద్ధి చేసేందుకు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాము ప్రయత్నిస్తుంటే, ఆ నిధులను తమ చేతికి ఇవ్వడంలేదని సర్పంచ్, ఆయన తండ్రి అసత్య ఆరోపణలకు తెరలేపారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రాజేంద్రప్రసాద్, గ్రామాభివృద్ధి కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ ఆనర్స్ కోర్సులతో ఉపాధి అవకాశాలు

ఇబ్రహీంపట్నం: నూతన విద్యా విధానం 2020లో భాగంగా ఈ ఏడాది ప్రవేశ పెట్టనున్న నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని జాకీర్‌హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబూబాషా పేర్కొన్నారు. కళాశాలలో సింగిల్, మేజర్ సబ్జెక్ట్‌లపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఒక సింగిల్, ఒక మేజర్ సబ్జెక్ట్‌తో పాటు లాంగ్వేజ్, స్కిల్ డెవలప్‌మెంట్, మల్టీ డైమెన్షన్ సబ్జెక్టులు ఎంపిక చేసుకోవాల్సి ఉందన్నారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ ఉత్తీర్ణుడై చదువు అక్కడతో ఆపేస్తే సర్టిఫికెట్ ఆఫ్ సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఏదో ఒకటి ఇస్తారు. సెకండ్ ఇయర్‌తో ఆపేస్తే డిప్లొమా, థర్డ్ ఇయర్‌తో ఆపేస్తే బ్యాచ్‌లర్ డిగ్రీ, ఫోర్త్ ఇయర్ పూర్తి చేస్తే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్ ఇస్తారు.

డిగ్రీ ఆనర్స్ కోర్సుకు పెరుగుతున్న ఆదరణ

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన సింగిల్ మేజర్ డిగ్రీ ఆనర్స్ కోర్సులకు విద్యార్థుల నుంచి ఆదరణ పెరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం కళాశాలలో సోమవారం విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. 2008లో స్థాపించబడి నేటికి 15 వసంతాలు పూర్తి చేసుకుని, చుట్టు పక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి నిరంతరంగా కృషి చేస్తోందన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టాలి

ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిబంధనలననుసరించి చేపట్టాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సబ్ రిజిస్ట్రార్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆమె రిజిస్ట్రేషన్ నిబంధనలను తెలియజేశారు. రైతులకు అవసరమైన రిజిస్ట్రేషన్ నకళ్లు, ఈసీలు ఇతరసేవలను



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

సత్వరం అందించాలని కోరారు. సబ్ రిజిస్ట్రార్లు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

నూజివీడు: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఆగిరిపల్లి ఎస్సై నంబూరి చంటిబాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రభుత్వ కళాశాల నుంచి ఆగిరిపల్లి మెయిన్ రోడ్డు వరకు మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చుట్టుపక్కల ఎవరైనా గంజాయి తదితర మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్ బాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యోహాన్, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ వసంతకుమారి, ఆంజనేయులు, రమేష్, ప్రియాంక పాల్గొన్నారు.

బలివే రామలింగేశ్వరుని భూమి కౌలుకు వేలం

ముసునూరు: బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన వేల్పుచర్లలోని భూమికి కౌలు వేలం రూ.23,000 పలికినట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. దేవస్థానానికి చెందిన వేల్పుచర్లలోని సర్వే నంబరు 376లో 1.16సెంట్లు భూమిలో మూడేళ్లపాటు కౌలుకు పంటలు పండించుకునే నిమిత్తం సోమవారం వేలం నిర్వహించగా ఏడాదికి రూ.23,000 చొప్పున కౌలు ఆదాయం దేవస్థానానికి లభించినట్లు పేర్కొన్నారు. బలివేలోని 8.78 ఎకరాల భూమికి త్వరలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, సభ్యుడు సీహెచ్‌జేఎల్‌కే ప్రసాదరావు, జె.రాహేలు, రెవెన్యూ, పోలీస్, గ్రామస్తుల సమక్షంలో హుండీలను తెరిచి, లెక్కించగా 115 రోజులకు రూ.79,814 ఆదాయం లభించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రక్షణనిధి

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరు): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకం అందని కుటుంబం లేదని, గ్రామాల్లో సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఇంకా అర్హులకు పథకాలు అందకపోతే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. పేదరిక నిర్మూలన, సామాజిక అసమానతల తొలగింపు ధ్యేయంగా ప్రభుత్వం పలు పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పక్కాగృహాలు నిర్మించుకునే పేదలకు కోరిన వెంటనే ప్రభుత్వం మంజూరు చేస్తోందని,



కొమ్మిరెడ్డిపల్లిలో సంక్షేమపథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కొమ్మిరెడ్డిపల్లిలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

నూజివీడు: స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నందున అధికారులు అలసత్వం వీడి అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో 12 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. పరిష్కార నివేదికకు లబ్ధిదారుల సమస్యకు సంబంధించిన ఫొటోలను జత చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఏడీఏ విద్యాసాగర్, సీడీపీఓ నూరాణి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్పీఓ సుందరి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు, హెచ్‌ఓ హేమ పాల్గొన్నారు.

‘స్పందన’లో రెండు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎల్ రాధికారాణి పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ అభివృద్ధి చేయాలని వినతి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి లబ్ధిదారులకు కొండపల్లిలో స్థలాలు కేటాయించిన జగనన్న లేఅవుట్ అభివృద్ధి చేయాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న కలెక్టర్ ఢిల్లీరావును కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో వినతి పత్రం అందజేశారు. గతంలో 475 మందిని అర్హులుగా గుర్తించి 395 మందికి పట్టాలు పంపిణీ చేశారని, ఇంకా 80 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు మౌలిక సదుపాయాలు లేవన్నారు. గతంలో సబ్‌కలెక్టర్ ప్రవీణ్‌చంద్ గ్రామంలో స్పందన నిర్వహించిన సమయంలో సమస్య ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



నూజివీడులో అర్జీలను తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ఎరువుల విక్రయాలు పారదర్శకంగా జరపాలి

తిరువూరు: ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు నిర్ణీత ధరకు మాత్రమే విక్రయించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ డీలర్లకు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమావేశం నిర్వహించారు. స్టాక్ బోర్డులో నిల్వ వివరాలు తెలియజేయాలని, రిజిస్టర్లలో సైతం స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీలర్లను కోరారు. అధిక ధరలకు అమ్మినా, నాసిరకం సరుకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలుష్యం నివారణ చర్యలు చేపట్టండి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు నుంచి వెలువడుతున్న కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ కుక్కపల్లి నాగేశ్వరరావు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు.

క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు

చిలుకూరువారిగూడెం(మైలవరం): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం చిలుకూరివారిగూడెం అప్పిడి సుబ్బారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు సోమవారం అందజేశారు. పేదలను విద్యావంతులను చేయాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామిరెడ్డి, పుల్లూరు సర్పంచ్ కొనకళ్ల నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. మండలంలోని పొందుగల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటమ్మ, మాజీ సర్పంచ్ డొంకెన చలపతిరావు పాల్గొన్నారు.



జగనన్న ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

తునికిపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం తునికిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రోత్సాహకాలను సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అందజేశారు. సర్పంచ్ మాధవి, విద్యా కమిటీ చైర్మన్ రాజీవ్‌గాంధీ, హెచ్‌ఎం ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

విస్సన్నపేట: గురుకుల పాఠశాల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం అభినందనీయం అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన రాంచంద్‌కు రూ.3 వేలు, శ్యాంసుందర్‌కు రూ.2 వేలు, బి.పండుకు రూ.1,000, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లేశ్వరి, ప్రిన్సిపాల్ జాన్సన్‌దేవరాజ్ పాల్గొన్నారు.

ప్రోత్సాహం అందిపుచ్చుకోవాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. కొండపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బి.నాగరాజకుమారితో కలిసి ఆమె పాల్గొన్నారు. టెన్త్‌క్లాస్ విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన బాలికలకు నగదు, జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.